కథ



# ఫీలింగ్స్!

- అనూరాధ

**రోడ్ క్రాస్ చేస్తూ చూశాను సడెన్‌గా! నాకు మాత్రమే పరిమితమనుకున్న ఆ స్కూటర్ వెనుక సీటు ఖాళీగా లేదు. విపరీతమైన కోపం ముంచు కొచ్చింది. ఎవరినో ఎక్కించుకున్నందుకు కాదు, ఆమె సొంత పెళ్ళాంలాగా నడుంపై చేతులేసినందుకూ కాదు. అతను వేయించుకున్నందుకు, ఆ చర్యలో పరమానందం పొందుతున్నట్టు ఫోజు ఇస్తున్నందుకూనూ!**

''**జర్!**'' ... మంటూ నాకు రెండు అంగుళాల దూరంలో ఆగిపోయింది కారు. మిగతా వారంతా యాక్సిడెంట్ జరిగిపోయిందనుకుని ఊపిరి బిగబట్టేశారు! నేను ఉలిక్కిపడి కారు డ్రైవర్ ఏం తిడుతున్నాడో విన్పించుకోకుండా పరుగున రోడ్ క్రాస్ చేసి ఇల్లు చేరాను.

❋❋❋

''**రాజ్!** మన పెళ్ళికి మా అమ్మా నాన్నలను అతి ప్రయాసతో ఒప్పించాను. సాధారణంగా ఉద్యోగం సద్యోగం లేని, ముక్కూ మొహ మెరుగని అనామకుడికి తమ అమ్మాయినిచ్చి వివాహం చేయడానికి ఏ తల్లిదండ్రులూ ఒప్పుకోరు. అలాగే నా తల్లిదండ్రులూ మొదట ఒప్పుకోలేదు. కానీ ఒకే ఒక్క కారణం వల్ల వాళ్ళు మన పెళ్ళికి అంగీకరించారు. అది, నా పట్ల వారికున్న 'నమ్మకం!' నేను ఏం చేసినా, ఏ నిర్ణయం తీసుకున్నా బాగా ఆలోచించి మంచి చెడు నిర్ణయించుకుని చేస్తానని, ఆ పనిలో ఒకవేళ ఏ కష్టనష్టాలెదురైనా నా ఆత్మస్థైర్యంతో వాటిని నెగ్గుతానన్న విశ్వాసం! అదే మన పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ అయ్యింది. కానీ నువ్వు చేస్తున్నదేమిటి? గత కొద్ది రోజులుగా నీ ప్రవర్తనలో అంతర్లీనంగా ఏదో వెలితి కనిపిస్తున్నది. అది నిన్ననే బహిర్గతమైంది!'' అన్నాను అసహనంతోపాటు కాస్త కోపాన్ని కూడా మేళవించి.

''నీవెవరి గురించి మాట్లాడుతున్నావో నాకర్థం కావడం లేదు'' అంటూ ఏమీ తెలియని అమాయకునిలా నటిస్తున్న అతన్ని చూస్తే కోపంతో పాటు అసహ్యమేసింది.

''ఎవరి గురించో అయితే నేను నీతో ఇవన్నీ ఎందుకు మాట్లాడతాను? నిన్న నీ స్కూటర్‌పై కనిపించిన అమ్మాయి నీ చెల్లెలు కాదని తెలుసు. కూర్చునే విధానం వావివరుసల్ని తెలుపుతుంది. లిఫ్ట్ ఇచ్చిన అమ్మాయి అంత చనువుగా ప్రవర్తించదు. సో! ...'' ఆగి అతనికేసి చూశాను.

అతను నిమ్మళంగా అన్నాడు, ''అది నీకనవసరం.''

''ఏది అవసరమో, ఏది అనవసరమో నీవు చెప్పక్కరలేదు. ఇది నా జీవితానికి సంబంధించిన విషయం! అందుకే ఇంత ఖచ్చితంగా అడుగుతున్నాను సూటిగా సమాధానం చెప్పు'' విసురుగా అడిగేశాను.

''చెప్పాల్సిందేముంది, నీకు నా పట్ల ప్రేమ భావన లేదు.''

''లేదని ఎలా కనుక్కున్నావు? అదీ ఇన్ని రోజుల తరువాత.''

''కాదా మరి! ఇన్ని రోజులలో సరదాగా సినిమాకో, షికారుకో వెళ్ళామా? అథవా వెళ్ళినా నీవక్కడా, నేనిక్కడ టైపే. పార్కులో కనీసం చేతిలో చేయైనా వేసుకున్న గుర్తు ఉందా? ముఖ్యంగా మన ఫ్రెండ్సందరం పిక్నిక్‌కి వెళ్ళినప్పుడు నేను ఎంత సరదాగా గడపాలనుకున్నానో, అంత దూరం మెయింటెన్ చేసి నా ఆశలన్నీ అడియాశలు చేశావు. ఇదంతా ఎందుకు?''

అతని పిచ్చితనానికి నాకు నవ్వు వచ్చింది. అయినా లోలోపల నవ్వుదాచుకుని అనునయంగా అన్నాను. ''రాజ్! లైఫ్‌లో డబ్బు ఎంతలాసైనా ఫరవాలేదు. మళ్ళీ సంపాదించుకోవచ్చు. కానీ ఫీలింగ్స్ లాస్ అయితే అది జీవితాంతపు నష్టం, మళ్ళీ పూరించుకోలేని నష్టం!

ఒక అబ్బాయిని మనస్ఫూర్తిగా ప్రేమించిన అమ్మాయి, ఆ అబ్బాయి దొంగ ముద్దు తీసుకుంటే ఉలిక్కిపడవచ్చు, సిగ్గుపడవచ్చు లేదా కోప్పడవచ్చు. అతనితోనే పెళ్ళైతే అది జీవితాంతపు తీయని తొలిముద్దు అనుభూతిగా మిగలవచ్చు. కానీ మరో అబ్బాయితో ఆమె వివాహం జరిగితే, అతనితో ఎంగేజ్‌మెంట్ జరిగినా చేయి కూడా తాకనివ్వని భయం ఆమెలో చోటు చేసుకుంటుంది. ఎందుకు?

ఒకసారి కోల్పోయిన నమ్మకం రెండవసారి వచ్చినా మొదట ఉన్నంత ఫ్రెష్‌గా ఉండదు. రెపరెపలాడే అనుమానం మధ్య అడ్డుపడుతూనే ఉంటుంది. అప్పుడా ఫీలింగ్‌లోని ఫ్రెష్‌నెస్ పోయినట్టే కాదా!? అంతేకాదు. భర్తతో ఆమె తొలిముద్దు అనుభవాన్ని ముగ్ధంగా పొందలేదు.

అలాకాకుండా మనసా వాచా కర్మణా కోరుకున్న అబ్బాయితో వివాహం జరిగి మధురోహలతో, కొత్త ఆశలతో చివుళ్ళు తొడిగిన మనసుకి భర్త అందించే తొలిముద్దు ఎంత మధురంగా ఉంటుంది. ఈ ఇద్దరిలో రెండవ అమ్మాయి నిస్సందేహంగా మధురమైన అనుభూతిని, కొత్తదనపు పరిమళాన్ని పొందుతుందనేది నిజం.

అనుభూతి అనేది లేతగా ఉన్నప్పుడు రసపూరితమైన మధుర భావన! అది ఎంతగా పెంపొందితే అంతగా పెనవేసుకునే గాఢమైన



అనుబంధం! వ్యక్తిగత జీవితానికి కావలసింది అదే. నా ఫీలింగ్స్‌లోని లేతదనాన్ని, ఫ్రెష్‌నెస్‌ని పోగొట్టుకో కూడదన్నదే నా ఆరాట మంతా!''

''నీలా కథలూ కాకరకాయలూ చెప్పడం. నాకు చేతకాదు. ఒక్క విషయం మాత్రం నీ మాటలలోనే స్పష్టమవుతుంది. ఆ అమ్మాయికి మరో అబ్బాయితో వివాహం జరిగితే... అన్నావే అంటే అతను మోసగాడైతే అనే కదా - నీదీ అదే ఫీలింగ్ అయినప్పుడు నా పట్ల నీకు నమ్మకం లేనట్టేగా, ఐ మీన్ ఒకవేళ చెట్టా పట్టాలేసుకుని తిరిగితే, తరువాత నాతో పెళ్ళి జరగక ఇంకొకరిని చేసుకోవాల్సి వస్తే - అందుకు నిన్ను నీవు మానసికంగా సిద్ధంగా ఉంచుకుంటున్నావన్నమాట! నేను మాత్రం నీది నిజమైన ప్రేమ అనుకుని ఫూల్‌లాగా నిన్ను నమ్మి ఆరా ధిస్తూ ఉండాలన్నమాట!''

''నేన్నది నీవు సరిగ్గా అర్థం చేసుకోలేదు రాజ్! స్పర్శకి ఒప్పు కోకపోవడం, మరొకరితో పెళ్ళైనా భవిష్యత్తులో ఏ గిల్టీ ఫీలింగ్ కలగ కుండా ఉండాలని కాదు. మన వ్యవస్థ వివాహానికి ముందు స్త్రీ పురుష స్పర్శ నిషేధించింది. యువతీ యువకుల వయస్సు ప్రభావాన్ని అనుసరించే, వయస్సులో ఉన్న మనస్సు ఎన్ని చిందులేస్తుందో ఎవరు చెప్పగలరు? చేతిలో చేయుంచడంతో ప్రారంభమైన ప్రేమ స్పర్శ ఇది తప్పు కాదనే ఎన్నో రకాల ఆత్మవంచనలతో పడకవరకు కూడా దారితీయవచ్చు లేదా మధ్యలో ఏదో ఒకచోట మనం ఆగి, ఆ స్థితినే నైతికంగా దిగజారనితనంగా భావించుకోవచ్చు. నైతిక విలువల స్వరూపం మన మనస్తత్వాలకు అనుకూలంగా మార్చుకొనే వీలుంది. కాబట్టే ఈ స్థితి మొదలు, ఈ స్థితి చివర అన్నది ఏ ఒక్కరు ఇదమిద్ధంగా తేల్చి చెప్పలేరు. ఏది ఏమైనా మన శరీరాల్ని పవిత్రంగా ఉంచుకోవడం మన విద్యుక్త ధర్మం. మన దేహాన్ని గౌరవించు కోవడమన్నది మన వ్యక్తిత్వానికి సంబంధించిన అంశం! అంతేకాని నీవు వక్రీకరించిన విధంగా దాంట్లో స్వార్థపూరితమైన అంశాలేవీ లేవు.''

అతను వ్యంగ్యంగా అన్నాడు. ''ఓహ్హోహ్హో! నైతికత గూర్చి మాట్లాడవలసి వస్తే అది త్రికరణ శుద్ధిగా ఉండాలి. అంటే మనసు నుండి ప్రారంభమై చర్యగా అంతం కావాలి. నీవు నన్ను ఓ ప్రేమికుడిగా, కాబోయే భర్తగా నీ మనస్సులో నిలుపుకున్నావు. ఒకవేళ నేను కాకుండా మరొక వ్యక్తి నీ జీవితంలోకి ప్రవేశిస్తే ... అప్పుడు అతన్ని నీ భర్తగా అంగీకరించి హృదయంలో చోటిస్తావు. అంటే ఒక రూపాన్ని తొలగించి మరొక రూపాన్ని ప్రతిష్ఠించుకుంటావు. అది నైతికంగా దిగజారడం కాదా? అప్పుడు నీ ఫీలింగ్‌లోని ఫ్రెష్‌నెస్ పోదా?''

''నువ్వు పొరబడ్డావు రాజ్! ఒక వ్యక్తిని హృదయంలో ప్రతిష్ఠించుకొని అతనితో మానసిక వ్యభిచారం చేయడం కాదు ప్రేమంటే. నేను ఇంతవరకు నీతో మానసిక వ్యభిచారం చేయలేదు. ఇంకో వ్యక్తిని పెళ్ళి చేసుకోవాల్సి వస్తే - అన్న ఆలోచనతో కాదు. నైతికంగా బలమైన వ్యక్తిత్వం కలిగి ఉండాలన్నది నా మొట్టమొదటి ఆశయం! అది ఇతరులు గుర్తించనక్కరలేదు. ఎవరిపట్ల వారికి గౌరవం, నమ్మకం కలిగించే అంశమిది.''

''నన్ను మనస్సులో ఊహించుకోనప్పుడు అది నన్ను ప్రేమించడం ఎలా అవుతుంది?'' తన వాదనకి బలమైన ఆధారం దొరికినట్లు సంతోషపడుతూ అడిగాడతడు.



''ఇద్దరి వ్యక్తులు పరస్పర నమ్మకంతో, గౌరవంతో ఆదరించుకొని జీవితాంతం ఒకరి ఆశయాలను సాధించడానికి, గమ్యాన్ని చేరుకోవడానికి మరొకరు తగిన చేయూతనివ్వాలి. మన భాగస్వామివల్ల జీవితం ఉత్సాహవంతంగానూ, ఉత్తేజితంగానూ మారాలి. అలాంటి



వారితో మానసిక వ్యభిచారం చేయకపోయినా 'వీరు నా జీవితానికి ముఖ్యమైన వ్యక్తి' అన్న ఒక మధుర భావన మనస్సులో అంతర్లీనంగా ఇమిడిపోతు, ఆ వ్యక్తి పట్ల ఒక రకమైన దగ్గర భావనకు గురిచేస్తుంది. అది పెరుగుతూ ఉంటే వ్యక్తిని విడిచి ఉండలేని అన్యోన్యతగా రూపొందుతుంది. అలా జరగనప్పుడు మనస్సులోంచి ఏదో ఒక సమయంలో ఆ భావం ఇగిరిపోతుంది.''

''స్టాప్ ... స్టాప్ ...! ఈ సుత్తంతా దేనికి ఇప్పుడు మన విషయంలో ఆ రెండోదే జరిగింది. ప్లీజ్ వాదాలొద్దు ...'' ఆ తరువాత అతను మాట్లాడబోయేదేమిటో నాకు తెలుసు. అందుకే సగంలో అందుకుని అన్నాను ''అదే జరిగిందని తెలుసు. ఇంతా చెప్పింది ఆ అమ్మాయిని వదిలేయమనో నన్ను పెళ్ళి చేసుకోమనో అడగడానికి కాదు. ఇప్పుడు నిన్ను చేసుకోవడానికి నేనేమీ సిద్ధంగా లేను. కానీ చివరిసారిగా మాట్లాడుకుని విడిపోవడం మంచిదన్న ఉద్దేశంతో ఇవన్నీ మాట్లాడవలసి వచ్చిందంతే.

ఏనీవే ... చెట్టాపట్టాలేసుకుని సినిమాలకీ, షికార్లకీ తిరగడమూ, సరదా సరదా సాయంత్రాలు, మానసిక వ్యభిచారాలు కావని ఆత్మవంచన చేసుకొనే నీలాంటి మూర్ఖుడి నిజస్వరూపం పెళ్ళికన్నా ముందే బయటపడినందుకు నేనెంతో అదృష్టవంతురాలిని. బైదిబై నీ పెళ్ళికి నన్ను తప్పకుండా పిలువు. నీలాంటి వాణ్ణి చేసుకునే 'అ'దృష్టవంతురాలెవరో చూడడానికైనా సరే వస్తాను'' అంటూ గబగబా వచ్చేశాను.

దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీళ్ళు ఆపాలన్నా ఆగడం లేదు. ఎందుకో అర్థంకాలేదు. అతను నన్ను మోసం చేశాడనా? నా అంచనాలెప్పుడూ తప్పవు అన్న నా అహానికి గండిపడినందుకా? లేక ఇన్ని రోజులూ అతని చుట్టూ అల్లుకున్న మమతా పూరితమైన ప్రేమ పాశంతో అతన్ని వదులుకోవల్సి వస్తుందేనన్న బాధా? ఏమో! మరి నా సంగతే ఇలా ఉంటే కలిసి కాపురం చేసిన జంటల్లో ఇలాంటివి జరిగితే? అందులోనే ఇమిడిపోయి బ్రతుకీడుస్తున్న స్త్రీని ఒక వ్యక్తిత్వం లేని వ్యక్తిగా జమకడతాము. అందులో ఆమె ఫీలింగ్ ఏమిటన్నది మనకి అవసరం లేదు. పోనీ ఆత్మహత్య చేసుకుంటే పిరికిదానిగా జమకడతాము. భర్తపోయినా, విడాకులిచ్చినా పాచి పనైనా చేసుకొని పిల్లల్ని పోషించుకునే స్త్రీలు ఇలాంటివి జరిగితే ఎందుకు ఛస్తారన్నది ఎప్పుడూ ఆలోచించం. దానిని ఒక మగవాడిపై ఆధారపడే స్త్రీ పిరికితనపు చర్యగా అపార్థం చేసుకుంటాము.

భర్తకు తన వల్ల కుటుంబం ఏర్పడిందని భర్తకు అన్ని రకాల సుఖ సౌఖ్యాలను అందించగల్గుతున్నానన్న తృప్తి, నిశ్చింత, ఒక విధమైన భద్రతాభావం, ప్రేమభావం! ఇవన్నీ ఫీలింగ్స్ మాత్రమే. కానీ ఆ ఫీలింగ్స్‌లోనే ఆమె ఆనందప్రదమైన జీవితం ఇమిడిపోయి ఉంది. అలాంటి భార్యకు భర్త మరొకరితో తిరుగుతున్నాడని తెలిసినప్పుడు కలిగే దుఃఖం భర్త తన నమ్మకాన్ని దెబ్బకొట్టినందుకే. నమ్మకం అన్నది ఒక ఫీలింగ్ అయితే ఆ భార్య మరణించేది ఆ ఫీలింగ్ లాస్‌ని తట్టుకోలేకే కానీ బ్రతకడానికి ధైర్యంలేక కాదు.

రకరకాల ఆలోచనలతో రాత్రంతా నిద్రరాలేదు. పైకెలా ఉన్నా, ఎలా మాట్లాడినా నాలోనూ సగటు ఆడపిల్లలలోని సెంటిమెంట్స్ ఉన్నాయా? అయినా మనిషిలో లేని లక్షణాలేవి? అన్నీ అంతర్గతంగా ఉండిపోయి, అవసరమైనప్పుడంతా ఒక్కో లక్షణం బయటకు వస్తూ మనల్ని ఒక్కోసారి మంచి వాళ్ళుగానూ, ఒక్కోసారి చెడ్డవాళ్ళుగానూ మారుస్తుంది.

***

లైబ్రరీలో నాకిష్టమైన బుక్ తీసుకుని బయటకి వస్తుంటే రాజ్ స్కూటర్‌పై మరో అమ్మాయి కూర్చోబోతూ ''నీ మాజీ ప్రేయసి డియర్!'' అంది.

''అరె! జానెదోయార్'' అని నాకు వినిపించేలా అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

అప్పటివరకూ నా మనసులో నాకు తెలియకుండానే అతని గూర్చిన ఆలోచనేదో మనస్సులో ఏమూలో కొట్టుమిట్టాడుతుందన్న విషయం నాకంతవరకు తెలీలేదు. ఆ మాట వినగానే ఆ ఆలోచనేదో పుటుక్కున తెగిపోయింది. మనస్సు మరింత ప్రశాంతంగా మారిపోయింది.

ఫీలింగ్స్ లాస్ నేనెప్పటికీ ఒప్పుకోని విషయం. ఎందుకంటే నా అందమైన జీవితపు ఆకాశహర్మ్యం పునాదులు అక్కడే ఉన్నాయి. నిచ్చెనలో ఎన్ని మెట్లెక్కినా నిచ్చెన నిలిపిన నేలతల్లిని ఏనాడూ మరువనట్లే నా ఫీలింగ్స్‌కి నేను ఇచ్చుకునే విలువా, గౌరవం ఎప్పుడూ ఒక్కటే. ఇంత జరిగినా నాకు ఒకే ఒక తృప్తి మిగిలిపోయింది. ''నా బిడ్డ ఎప్పుడూ తప్పు చేయదు'' అన్న నా తల్లిదండ్రుల నమ్మకంపై నేనెప్పుడూ దెబ్బకొట్టలేదు!

## ముద్దు-వద్దు!



ముద్దంటే చేదే! అంటోంది మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య. డల్ ఫేస్ చంద్రచూడ్ సింగ్‌ని ముద్దు పెట్టుకోవాల్సిన సీను 'జోష్' కోసం తీయాల్సి వస్తే ఐశ్వర్య 'అదొక్కటీ అడక్కు' అందిట. ఇంక గత్యంతరం లేక డైరెక్టరు కెమేరాతో ముద్దు సీను చేసేసి ఇక ఇంతేలే - అని సరిపెట్టుకున్నాడుట. ఐశ్వర్య అలా అనడానికి కారణం ఏమై ఉంటుందో? సల్మాన్ సలహా అడగలేదా? ఏమో!